క్లుప్తంగా

రీసర్వే డెప్యూటీ తహసీల్దార్‌గా ప్రసాదరావు

మోపిదేవి: మండల రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్‌గా ముక్కా ప్రసాదరావును ప్రభుత్వం నియమించింది. గన్నవరం మండలంలో ఈఆర్ ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న రీ సర్వే డీటీ నీలిమను చల్లపల్లి మండలానికి బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

చేనేత సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట

పెడన: చేనేత సమస్యల పరిష్కారానికి నేత కార్మికులు ఉద్యమాల బాట పట్టాల్సి ఉంటుందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కట్టా హేమసుందరరావు అన్నారు. ఏపీ చేనేత కార్మిక సంఘం వ్యవస్థాపక దినోత్సవం గురువారం పట్టణంలోని సర్వోదయ సొసైటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమసుందరరావు మాట్లాడుతూ ముందుగా కార్మికులకు చేనేత వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బూసం బాలసుబ్రహ్మణ్యం, రావూరి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ

మోపిదేవి: ఆకుమచ్చ, కాయమచ్చ, బూజు వంటి తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ వినియోగించాలని జాతీయ సేవా పథకం నిర్వాహకుడు డాక్టర్ సంధ్య తెలిపారు. జాతీయ సేవ పథకంలో భాగంగా గురువారం వివిధ తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ తయారీపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ మిశ్రమాన్ని వివిధ తెగుళ్ల నివారణకు ఉపయోగించవచ్చునని తెలిపారు. అనంతరం బాపట్ల కళాశాల విద్యార్థులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీలో గర్భిణులకు పండ్లు పంచారు. ప్రధాన రహదారులు, గ్రంథాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేశారు. అభ్యుదయ రైతులు పిచ్చేశ్వరావు, రామకృష్ణ, పిచ్చేశ్వరావు, కంఠంనేని కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

పెడన: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)ను కంప్యూటరీకరిస్తున్నామని జిల్లా సహకార శాఖాధికారి చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం ఆయన పెడనలోని జయలక్ష్మి పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ చేసిన అనంతరం ఆఫీసును సందర్శించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. లావాదేవీలన్నీ ఇక నుంచి కంప్యూటరీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పెడన సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్ర పరికరాలకు పేర్లు నమోదు చేసుకోండి

ఘంటసాల: వ్యవసాయ శాఖ రైతులకు రాయితీపై అందించే వ్యవసాయ పరికరాలకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీ కృష్ణ గురువారం తెలిపారు. ఏవో మాట్లాడుతూ వ్యవసాయ ఇంజినీరింగ్ అధికారులు, నిపుణులు సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై అందిస్తారన్నారు. బ్యాటరీ, తైవాన్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ఎంబీ ప్లౌగ్, గట్లు వేసే మిషన్, బూమ్ స్ప్రేయర్, విత్తనాలు నాటే యంత్రం, పవర్ వీడర్, పవర్ టిల్లర్, చెట్లు నరికే యంత్రం, దమ్ము చక్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్, ట్రాక్టర్ సాయం నడిచే యంత్ర పరికరాలకు ఆర్‌సీ బుక్ నకళ్లు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఏవో మురళీ కృష్ణ తెలిపారు.

విజయ్‌స్వామి కుటుంబానికి రూ.లక్ష సాయం



చల్లపల్లి: ఇటీవల శబరిమలలో గుండెపోటుతో మరణించిన చల్లపల్లికి చెందిన ఆకుల విజయ్ స్వామి కుటుంబ సభ్యులకు అయ్యప్ప భక్తులు రూ.లక్ష సాయాన్ని గురువారం అందజేశారు. శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉప్పాల సుబ్బారావు, యార్లగడ్డ శివయ్య, రావులపల్లి పండు గురుస్వాములు వారి పీఠాల పరిధిలోని శిష్యుల నుంచి సాయాన్ని సమీకరించారు. ఈ మొత్తాన్ని విజయ్ స్వామి కుమార్తె ధనుష పేరున డిపాజిట్ చేసి ఆ బాండును విజయ్‌స్వామి భార్య రశ్మికి అందజేశారు. బాండు అందజేసిన వారిలో గురుస్వాములు మత్తి నాగేంద్రం, కస్తూరి వెంకట కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బీసీ సమరభేరిని విజయవంతం చేయాలి

కొడాలి(ఘంటసాల): బలహీనవర్గాల వారికి 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శుక్రవారం మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద జరిగే సమర భేరిని విజయవంతం చేయాలని బీఎస్పీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు గురువారం తెలిపారు. కార్యకర్తలు, నేతలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



పాలెం-భావదేవరపల్లి రోడ్డు దుస్థితి



పాలెం-భావదేవరపల్లి రోడ్డుపై దూసుకుపోతున్న భారీ ఆయిల్, గ్యాస్ ట్యాంకర్లు

- అధ్వానంగా భావదేవరపల్లి మెయిన్‌రోడ్డు
- ఎమ్మెల్యే స్వగ్రామానికే దారీతెన్నూ లేని వైనం
- రోడ్డు పునర్నిర్మాణ పనులపై మొండికేసిన ఓఎన్జీసీ
- భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసం

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది భావదేవరపల్లి మెయిన్ రోడ్డు. నాగాయలంక సమీపంలోని వక్కపట్లవారిపాలెం సమీపంలోని ఓఎన్జీసీ చమురు, సహజ వాయువుల చమురు క్షేత్రం కారణంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్వగ్రామం భావదేవరపల్లి మెయిన్ తారురోడ్డు (5కి.మీ) ఉనికి కోల్పోయింది. రోడ్డు నిర్మించాల్సిన ఓఎన్జీసీ సంస్థ వైఖరి నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఆ సంస్థ ఆయిల్, గ్యాస్ భారీ ట్యాంకర్లు, ఇతర భారీ వాహనాలు నిత్యం తిరగడంతో ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మెయిన్ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఓఎన్జీసీ చేపట్టాలంటూ ఇటీవల నెల రోజుల వ్యవధిలో రెండు సార్లు నిరసన, రోడ్డుపై బైఠాయించిన విషయం తెలిసిందే.



వక్కపట్లవారిపాలెం లాకులు సెంటర్‌లో ఏడాది క్రితం సంస్థ ఆవిష్కరించిన శిలాఫలకం

'కోడ్' సాకు చూపి తప్పుకున్న ఓఎన్జీసీ

గతేడాడి మార్చిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు ఆందోళన చేపట్టారు. అప్పట్లో తక్షణం స్పందించిన సంస్థ ఈడీ అస్సెట్ మేనేజర్(రాజమండ్రి అస్సెట్) శంతను దాస్ అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబును సంప్రదించారు. ఓఎన్జీసీ-వేదాంత నిధులు రూ.191లక్షలు కేటాయించి 2.2కి.మీ బి.టి రోడ్డు పనులకు గతేడాది మార్చి 12న ఎమ్మెల్యేతో కలసి శంకుస్థాపన చేసారు. ఆ సందర్భంగా అదే నెలాఖరు లోపు రోడ్డు నిర్మిస్తామని సంస్థ ఉన్నతాధికారి పేర్కొనగా ఆ తర్వాత ఎన్నికల కోడ్ చెప్పి ఆ సంస్థ తప్పించుకుంది.

అదిగో ఇదిగో..

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఓఎన్జీసీ ఉన్నతాధికారులను కలసి నిధులు మంజూరు చేయించాను అదిగో ఇదిగో రోజుల వ్యవధిలో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తున్నామని ప్రకటించారు. ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో ప్రభుత్వం గుంతలు పూడ్చేస్తుందంటూ వివిధ సైజుల్లో కంకరను గుంతల్లో పోసి వదిలేయడంతో భావదేవరపల్లి వరకు 5కి.మీ మేర గ్రామాల మెయిన్ రోడ్డు మరింత దుర్భరంగా మారింది. ఓఎన్జీసీ భారీ వాహనాల స్పీడ్‌తో పెద్ద ఎత్తున దుమ్ము కమ్మేస్తోంది. ఇప్పటికైనా ఓఎన్జీసీ సంస్థ రోడ్డు నిర్మాణానికి స్పందించాల్సి ఉంది.

గ్రామాభివృద్ధిని విస్మరించారు



గ్రామ ముఖ ద్వారం ఓఎన్జీసీ కారణంగా అస్తవ్యస్తంగా మారింది. మా ప్రాంతం నుంచి చమురు సహజ వాయువుల నిల్వలు భారీగా తరలించుకుపోతున్న ఆ సంస్థ గ్రామాభివృద్ధిని విస్మరించింది.

–వక్కపట్ల శ్రీహరి, రైతు, పంచాయతీ సభ్యుడు, వక్కపట్లవారిపాలెం

రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది



ఓఎన్జీసీ నిర్లక్ష్య వైఖరితో భావదేవరపల్లి వరకు 5కి.మీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అనేక తీర గ్రామాలకు ఈ మెయిన్ రోడ్డే ఆయువు పట్టు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ ఏమైపోయిందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ సంస్థ నిండా ముంచేసింది.

–మండలి ఉదయభాస్కర్, సర్పంచి, భావదేవరపల్లి

పంచాయతీలకు నూతన కార్యదర్శులు

కోడూరు: పంచాయతీరాజ్ శాఖలో జరిగిన పదోన్నతిలో భాగంలో మండలంలోని ఐదు పంచాయతీలకు నూతన కార్యదర్శులు నియామకమయ్యారు. లింగారెడ్డిపాలెం, మాచవరం గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న సుధీర్, ఏడుకొండలు గ్రేడ్-3గా పదోన్నతి పొంది పిట్టల్లంక, ఉల్లిపాలెం సచివాలయాలకు కార్యదర్శులుగా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. హంసలదీవి, కోడూరు-2, వి.కొత్తపాలెం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న లీలాప్రియాంక, శివకుమార్, తనూజ గ్రేడ్-4గా పదోన్నతి పొంది రామకృష్ణాపురం, వి.కొత్తపాలెం, మాచవరం కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఇచ్చిన పదోన్నతి పత్రాలను కార్యదర్శులు ఎంపీడీఓ సుధాప్రవీణ్‌కు అందించారు. పదోన్నతి పొందిన కార్యదర్శులను ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

మురుగు బోదె పూడ్చిన రైతుపై ఫిర్యాదు

బంటుమిల్లి: పెదతుమ్మిడి పంచాయతీ శివారు పెనుమాలగూడెం పరిధిలో ఉన్న మురుగు బోదెను రైతు పూడుస్తుంటే సరిహద్దు రైతులు గురువారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో ఉన్న భూములను భూ స్వామి కొని చెరువులుగా మార్పులు చేపట్టారు. చెరువుల తవ్వకంలో భాగంగా సరిహద్దులో ఉన్న మురుగు బోదెను కూడ చెరువులో కలిపి తవ్వుతున్నారు. దీని కారణంగా సరిహద్దు పొలాల్లోని మురుగు నీరు బయటకెళ్లడం ఇబ్బంది అవుతోందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ కె. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రైతులతో చర్చించి పూడ్చిన బోదె తవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

లీలావతి సేవలు మరువలేం





సంతాపం వ్యక్తం చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, కౌన్సిల్ సభ్యులు

మచిలీపట్నంటౌన్: మాజీ కౌన్సిలర్ తలారి లీలావతి చేసిన సేవలు మరువలేనివని పలువురు కార్పొరేటర్లు తెలిపారు. గత నెల 26న ఆకస్మికంగా మృతి చెందిన లీలావతికి గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడానికి ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. లీలావతి మృతి కారణంగా సంతాప తీర్మానాన్ని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మేయర్ మాట్లాడుతూ ఆమె కార్యకర్తగా పని చేసి పలు పదవులను సమర్థంగా నిర్వహించారన్నారు. కౌన్సిల్ తరఫున ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె కృషి చేశారని శ్లాఘించారు. కార్పొరేటర్లు మీర్ అస్గర్‌అలీ, చిత్తజల్లు ప్రసన్న, పరింకాయల విజయ్, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, మరకాని సమతాకీర్తి తదితరులు ఆమె సంతాపం తెలిపారు. సమావేశాన్ని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు మేయర్ వెంకటేశ్వరమ్మ ప్రకటించి సభను ముగించారు.

'కార్పొరేషన్' వద్ద చలివేంద్రం ఏర్పాటు



మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, యూబీ రీజినల్ హెడ్ వెంకట్రావు తదితరులు

మచిలీపట్నంటౌన్: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద శ్రీ సత్యసాయి చలివేంద్రాన్ని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ ఏటా మాదిరి ఈ సంవత్సరం కూడా మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిలో వెళ్లే బాటసారులకు, కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ పేదలకు ఉచిత వైద్య సేవ, నారాయణ సేవ, నిత్యవసర సరుకుల పంపిణీ, మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్‌లు అందించడాన్ని ఆమె కొనియాడారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వెంకటరావు, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమనగిరి చంద్రశేఖర్, సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ ప్రసంగించారు. సుమారు 1,500 మందికి చల్లటి మజ్జిగ, తాగునీటిని అందించారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్‌లు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ చికిత్స కేంద్రం ప్రారంభం



మధుమేహ వ్యాధిపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన కృష్ణా యూనివర్సిటీ వీసీ రాంజీ

మచిలీపట్నంఅర్బన్: త్రిపుర సుందరి ఫౌండేషన్ ఇండియా సేవలు మరువలేనివని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాంజీ కూన అన్నారు. పరాసుపేటలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మధుమేహ చికిత్స కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ అశ్విని కుమార్ గర్భిణుల్లో మధుమేహంపై అవగాహన కల్పించడానికి పుస్తకాన్ని ప్రచురించి, ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సంస్థ పేదలకు ఉచిత వైద్య సదుపాయం, మహిళలకు కుట్టుశిక్షణ, విద్యార్థులకు తెలుగు, హిందీ, టైప్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అనంతరం డాక్టర్ అశ్విని కుమార్ ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రవిచంద్ర, డాక్టర్ టి. పవన్ కుమార్, డాక్టర్ కేవీ శివప్రసాద్, ఫౌండేషన్ కార్యదర్శి వింజమూరు శివరాం, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ ఆలయ అనువంశిక ధర్మకర్తగా 'పెళ్లూరి'

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో శ్రీ భూ నీలా సమేత చెన్నకేశవస్వామి ఆలయ అనువంశిక ధర్మకర్తగా పెళ్లూరి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం గురువారం చేశారు. ఉదయం స్వామివారి సన్నిధిలో దేవదాయశాఖ కృష్ణా జిల్లా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సుమారు 250 ఏళ్ల క్రితం ఈ ఆలయంను పెళ్లూరి పెద బసవయ్య నిర్మించారని, నాడు దీని ధర్మకర్తగా ఉన్న పెళ్లూరి పాంచజన్యం 11 ఎకరాల పొలం దానం చేశారని గుర్తుచేశారు. ఆనంతరం 2011లో సీజీఎఫ్ నిధులతో ఆలయాన్ని పునఃనిర్మించారు. నాడు ధర్మకర్తగా పెళ్లూరి వంశస్తులను గుర్తించకపోవడంతో 2011లోనే వారు కోర్టును ఆశ్రయించారు. ఆలయ ధర్మకర్తలుగా పెళ్లూరి వంశీకులను నియమించాలని 2024లో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశానుసారం పెళ్లూరి వంశీకులను ఆలయ ధర్మకర్తగా ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, ప్రముఖ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ శ్రావణి, అడవి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

ఘంటసాలపాలెం(ఘంటసాల): ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ప్రోత్సహించాలని ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజని అన్నారు. ఘంటసాలపాలెం సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం -2025 యాక్షన్ ప్లాన్ గ్రామసభను సర్పంచ్ రజని ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చిట్టూర్పు యూనిట్ ఇన్‌చార్జి ఎస్.నాగరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశం, పీఎండీఎస్‌తో రైతులకు కలిగే లాభాలను తెలిపారు. డీఎంఎం అచ్చిమాంబ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సూత్రాలను రైతులకు చెప్పారు. తొలుత గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడానికి..

మచిలీపట్నంటౌన్: ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ వెంకట్రావు తెలిపారు. నగరంలోని ప్రధాన రహదారిలోని యూబీఐ వ్యవస్థాపక బ్రాంచ్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డెప్యూటీ రీజినల్ హెడ్స్ రామలింగారెడ్డి, తాతాజీ, ఫౌండర్స్ బ్రాంచ్ హెడ్ ఝాన్సీరాణి, బ్యాంక్ సంఘ నేతలు దుర్గారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



గూడూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఆకులమన్నాడు సర్పంచి మొహమ్మద్ రఫీ అన్నారు. పోషణ్ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా ఆకులమన్నాడు పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు పోషకాహార అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రక్తహీనత రాకుండా ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది సూచించినట్లు విటమిన్, ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా మహిళలకు ఎలాంటి రుగ్మతలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల లక్ష్మణరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషశ్రీ, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు. పోషకాహార కిట్లను పంపిణీ చేశారు.

బంటుమిల్లి: నాగన్నచెరువు పంచాయతీ శివారు లక్ష్మీపురం గ్రామంలో గురువారం పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ సముద్రవేణి వెయ్యి రోజులపాటు తీసుకోవలసిన పోషణపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సెక్టారు సూపర్‌వైజరు నాగలక్ష్మి, ఏఎన్ఎం సంతోషమ్మ, మహిళా పోలీసు షర్మిల తదితరులు పాల్గొన్నారు.

దేవరకోట(ఘంటసాల): చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఆరు నెలల వరకు తల్లిపాలు బిడ్డలకు అందించాలని ఘంటసాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు మునిపల్లి నాగ స్వర్ణ, ఏఎన్ఎం డి.సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల్లో కల్తీ గుర్తించడంపై శిక్షణ



రావివారిపాలెం(మోపిదేవి): కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే పాలిష్ బియ్యం బాగా తగ్గించాలని కృష్ణా జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. రావివారిపాలెంలో ఆహార పదార్థాల్లో జరిగే కల్తీ, వాటిని గుర్తించే పద్ధతులపై గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత చట్టంపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడరాదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలని సూచించారు. 100శాతం మంచి నూనెను మాత్రమే ఉపయోగించడం ఆరోగ్యకరమని, టెట్రాజన్ కలిపిన టీ పొడులు వాడటం మంచిది కాదన్నారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆర్గనైజర్ డాక్టర్ సంధ్య, ప్రిన్సిపల్ రిప్రజెంటెటివ్ డాక్టర్ బి.అపర్ణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కంఠంనేని కుటుంబరావు, అభ్యుదయ రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరావు, రామకృష్ణ బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి పనులు



కోడూరు రహదారి నిర్మాణ పనులు

కోడూరు: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. 2016 కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిని నిర్మించింది. అయితే నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో రోడ్డు వేసిన ఏడాదికే శిథిలావస్థకు చేరి గోతులమయంగా మారింది. సుమారు ఏడేళ్ల నుంచి కోడూరు రోడ్డుకు మోక్షం లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో గత ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ రహదారి నిర్మాణానికి రూ.16.5కోట్ల నిధులు కేటాయించింది. ఎన్నికల సమయానికి రహదారికి సంబంధించిన జీఎస్‌బీ, డబ్ల్యూఎంఎం పనులను పూర్తి చేసింది. సుమారు 40 శాతం పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది.

రోడ్డు పాట్లు

ఎన్నికల్లో కూటమి గెలుపొందడంతో కోడూరు రహదారి మళ్లీ యథాస్థితికి చేరింది. కూటమి ప్రభుత్వం రహదారి పనులను మధ్యలో నిలిపివేయడంతో ప్రజలు రహదారిపై ప్రయాణించేందుకు పడరాని పాట్లు పడ్డారు. భారీ వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి లేచి ద్విచక్రవాహన చోదకులు కనీసం రహదారి వెంట వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు పనులు కూటమి ప్రభుత్వం మధ్యలో నిలిపివేయడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తిరిగి రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు.

కొంగు బంగారం.. మారెమ్మ

- మూడేళ్లకోసారి వచ్చే మూడు రోజుల జాతర
- నేటి నుంచి ఉత్సవం



చింతలమడ మారెమ్మ తల్లి

చల్లపల్లి: మండలంలో లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని చింతలమడ గ్రామ దేవత శ్రీమారెమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మూడేళ్లకు ఒకసారి జాతర జరుగుతుంటుంది. ఉత్సవాల్లో మొదటి రోజు శుక్రవారం తెల్లవారు జామున ఊరి పొలిమేర వద్ద పూజలు చేసి అటునుంచి అటు దక్షిణ కాశీగా పిలువబడే మోపిదేవి మండలం, పెదకళ్లేపల్లిలోని కృష్ణానదిలో స్నానాలు ఆచరిస్తారు. పోతురాజు గెడ, మహాలక్ష్మితల్లి ఘటాలను కూడా రేవులో స్నానం చేయించి మొదటి, రెండవ రోజు గ్రామంలో ఊరేగిస్తారు. చివరి రోజైన ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి చెట్టు వద్ద పాలపొంగళ్ళు తయారు చేసి మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం ముందు కుంభంగా పోస్తారు.

ఆలయ పరిసరాలు ముస్తాబు

ఇప్పటికే శ్రీమారెమ్మ తల్లి ఆలయాన్ని పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు బయట గ్రామాల నుంచి కూడా భక్తులు, బంధువులు, ఇంటి ఆడపడుచులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

పెడన: బడిఈడు పిల్లలంతా బడుల్లో ఉండేలా ఉండేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో-1 ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం మధ్యాహ్నం పెడనలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యా వనరుల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్లు పూర్తి చేసుకున్న అంగన్‌వాడీల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ చేయడం ప్రధానమన్నారు. 5 నుంచి 9 వరకు ఉన్న తరగతుల్లో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం చేరేలా చూడాలన్నారు. బడి మానేసిన విద్యార్థులను బడి బాట పట్టించాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు ఉంటాయన్నారు. విద్యార్థుల మార్కుల నమోదు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రగతి నివేదికలు తయారు చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎంఈవో-2 హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు వినియోగించుకోండి

బంటుమిల్లి: వసతులు వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. ప్రిన్స్‌పాల్ ఎస్. జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో వసతులకు ప్రభుత్వం రూ. 5 కోట్లు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 22 కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణం చేశామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కాలేజీ వార్షికోత్సవంలో భాగంగా పలు పోటీల విజేతలకు కాగిత బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బంటుమిల్లి డీసీ చైర్మన్ బి. కాశీవిశ్వేశ్వరరావు, టీడీపీ మచిలీపట్నం పార్లమెంటు లీగల్‌సెల్ కన్వీనరు రంగనాథ్, విశ్రాంత ఆర్ఐఓ ఎం. రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై సమీక్ష

గూడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలపై డీఎస్ఓ వి.పార్వతి గురువారం సమీక్ష నిర్వహించారు. మండలంలోని పోలవరం, రామరాజుపాలెం, కంకటావ గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించడానికి గవర్నమెంట్ మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తోంన్నారు. ఈ విధానంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కంకటావ ఆదర్శ పాఠశాలలో కొత్తగా ఐదుగురు విద్యార్థులు ప్రవేశం పొందటానికి అంగీకరించడంతో అభినందించారు. పోలవరం పాఠశాలను హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలని గత కొంతకాలంగా స్థానికులు కోరుతుండగా, దీనిపై మండల విద్యాశాఖ అధికారులు బీఎస్‌సీ శేఖర్‌సింగ్, పి.సుబ్రహ్మణ్యంతో సమీక్షించారు.

నేడు జ్యోతిరావుపూలే జయంతి

చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆశాఖ అధికారి జి.రమేష్ గురువారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు వలందపాలెం వద్ద ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి పుష్పాలంకరణ జరుగుతుందన్నారు. అనంతరం 10 గంటలకు జెడ్పీ సమావేశ హాలులో జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.